

# ఆ కుటుంబంతో ఒక రోజు

( 20 కథల సంపుటం )

జె. యు. బి. వి. ప్రసాద్

# ఆ కుటుంబంతో ఒక రోజు

(20 కథల సంపుటం)

జె. యు. బి. వి. ప్రసాద్

నవోదయ బుక్ హౌస్
(ఆర్య సమాజ మందిరం ఎదురు సందులో)
కాచిగూడ చౌరస్తా
హైదరాబాదు - 500 027

ఆ కుటుంబంతో ఒక రోజు
(20 కథల సంపుటం)

పేజీలు : 182
[ 1/8 డెమ్మీ సైజులో,
హార్డ్ బౌండుతో ]

మొదటి ముద్రణ: 2010 నవంబర్

ధర : 40 రూ.లు

కంపోజింగ్ & పేజ్ మేకప్:
ధనలక్ష్మి; రఘురామయ్య

ముద్రణ:
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా
హైదరాబాదు - 500 020.

బైండింగ్:
వై. వి. రెడ్డి బైండింగ్ వర్క్స్
హైదరాబాదు - 36

ప్రతులకు:
నవోదయా బుక్ హౌస్
కాచిగూడా చౌరస్తా
హైదరాబాదు - 500 027
(ఫోను: 040-2465-2387)

రచయిత అడ్రసు:
J.U.B.V. Prasad
10401, North Blaney Avenue
Cupertino
California - 95014
U.S.A
ఫోను: 1-408-202-4704
ఈ-మెయిల్: jubv@yahoo.com

# విషయ సూచిక

ముందు మాట
1. ఆ కుటుంబంలో ఒక రోజు ............. 5
2. పులిని చూసి... ............................... 16
3. నాస్తిక భర్త ...................................... 25
4. అంజనం ........................................ 32
5. మైల ............................................. 44
6. పిత్రోత్సాహం!................................. 54
7. కష్టార్జితం ..................................... 63
8. వంశ వృక్షం .................................. 73
9. అమెరికాలో రుబ్బురోలూ, ............. 80
కంది పచ్చడీ!
10. మరణానంతరే ................................ 91
11. విధాయకం ..................................... 100
12. ప్రశ్న!............................................. 107
13. భయం! భయం! .......................... 114
14. పోలీసాయన ................................ 127
15. పుస్తకం .......................................... 132
16. చాదస్తం! ........................................ 140
17. జన్మ దిన రాహిత్యం ...................... 150
18. ఇదేనా దీపావళి? .......................... 156
19. మంత్రాలకు శక్తి ఉందా? ............. 166
20. అభిమానం ..................................... 176

# ముందు మాట

'ముందు మాట' రాయనా? ఏం రాయను? నా మొహం! కథలంటే, ఏదో మిడికాను. చిన్నప్పుడు మా ఇంట్లోనూ, నేనున్న ఊళ్ళలోనూ ఏవో అనుభవాలు దొరికి, అవి అప్పుడప్పుడు గుర్తొచ్చి, ఏవో చిట్టి పొట్టి కథలు రాశాను. నాకు మొదటి నించీ కథల పుస్తకాలు చదవడం అలవాటే గానీ, రంగనాయకమ్మ గారి రచనలే నాకు బాగా పట్టాయి. ఆవిడ రచనల్లోని కొత్త కొత్త భావాలు నాకు చాలా ఇష్టం. అవన్నీ నేను నేర్చుకున్నానని కాదు. ఆ అభిప్రాయాలన్నిటినీ నేను సక్రమంగా ఆచరిస్తున్నానని చెప్ప లేను. వాటితో పూర్తిగా ఏకీభవిస్తూ, ఆచరించడానికి ప్రయత్నిస్తు న్నానని మాత్రం చెప్పగలను.

చిన్నతనం నించీ నేనొక గట్టి భక్తుడిని. భగవద్గీత శ్లోకాలు కంఠస్తం పట్టడం దగ్గర్నించీ, పెద్ద వాళ్ళతో కలిసి గుళ్ళనీ, గోపురాల్నీ దర్శిస్తూ, ఉపోషాలు ఉంటూ ఉన్న వీర భక్తుడిని. అయితే, "రామాయణ విషవృక్షం" చదివాక, తర్కంతో ఆలో చించడం నేర్చుకున్నాను. నాస్తికుడిగా మారిపోయాను. ఆ భావా లతో కొన్ని కథలు కూడా రాశాను. ఇప్పుడు 'భక్తి' అంటే నాకు హాస్యం.

ఈ కథలన్నిటికీ ఆధారం: నా అనుభవాలూ, జ్ఞాపకాలూ, ఇతరులు చెప్పగా విన్నవీ, స్వయంగా చూసినవీ. నాకు తెలిసిన ఊళ్ళే ఈ కథల్లో కనిపిస్తాయి. కాకినాడా, హైదరాబాదూ, మద్రాసూ, అమెరికాలో నేనున్న ఊళ్ళూనూ!

ఈ కథలు, అచ్చులో వచ్చే పత్రికల్లోనూ, ఇంటర్నెట్‌లో వచ్చే 'వెబ్' పత్రికల్లోనూ వచ్చాయి. వీటిని ప్రచురించిన ఆ పత్రికా సంపాదకులకూ, ఆ యా విభాగాల బాధ్యులకూ నా దండాలు!

ప్రసాద్

25 అక్టోబరు, 2010 ★

# 1. ఆ కుటుంబంతో ఒక రోజు!

అమెరికా రావడమైతే గెంతుకుంటూ వచ్చేశాను గానీ, వచ్చేశాక, వాళ్ళ భాషకి దడుసుకునే వాడిని మొదట్లో. ఒక్క ముక్క అర్థం అయితే ఒట్టు! ఇంగ్లీషు భాష రాక కాదు. అది వీళ్ళు మాట్లాడే విధానం అర్థం అయి చావక. ఇన్నాళ్ళూ హాయిగా ఇండియన్ యాక్సెంట్‌లో ఇంగ్లీషు మాట్లాడుకుంటూ, ఇండియాలో సుఖంగా బతికే వాడిని. ఇండియాలో ఉన్నప్పుడు, ఏ ప్రాంతం వాడు ఎంత ఇంగ్లీషు మాట్లాడినా, ఈజీగా అర్థం అయిపోయేది. కానీ ఈ అమెరికా వాడి ఇంగ్లీషు మాత్రం ఓ పట్టాన అర్థం అయిచచ్చేది కాదు.

నా గోల వీళ్ళకర్థం అయ్యేది కాదు, వీళ్ళగోల నా కర్థం అయ్యేది కాదు. మళ్ళీ అందరం మాట్లాడేది ఒకే భాషలో. వచ్చిన కొత్తలో, ఒకసారి ఒక హోటల్‌లో ఉన్నాను కొంత కాలం. ఆ రోజుల్లో, ఆ హోటల్ రిసెప్షనిస్ట్‌కి నా గోల వెళ్ళబోసుకోవడానికి, చచ్చి సున్నం అయి, ఆఖరికి కొంచెం తెలివి వచ్చి, కాగితం మీద రాసి చూపించేసరికి, ఆ అమ్మాయికి విషయం అర్థం అయి, మొహం చింకి చేటంతయ్యింది. నా మొహం చింకని చేటంతయ్యింది.

తర్వాత కాలంలో, వీళ్ళ యాక్సెంటు నేర్చుకుని, పూర్తిగా కాదనుకోండీ, వీళ్ళకి నా యాక్సెంటు నేర్పించి, అదీ పూర్తిగా కాదనుకోండీ, రోజులు గడపడం మొదలు పెట్టాక, ఇండియా వాళ్ళ యాక్సెంటు నాకు ఘోరంగా వినపడ్డం మొదలు పెట్టింది. మొత్తానికి అలా రోజులు వెళ్ళబుచ్చే వాడిని.

ఆ రోజుల్లోనే నాకొక చిన్న కోరిక ఉండేది. ఎవరైనా అమెరికా వాళ్ళింట్లో కొన్నాళ్ళు ఉండాలని, పిచ్చి ఆశగా ఉండేది. వచ్చింది అమెరికాకి అయినా, పని చేసేది ఇండియన్ కంపెనీలో. మా కంపెనీలో ఉన్న అమెరికన్లని రెండే రెండు వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. వీళ్ళిద్దరూ ఒకరు డైరెక్టరూ, ఒకరు వైస్ ప్రెసిడెంటూ. వీళ్ళు కూడా సమోసాలూ, దోశలూ తిని, మాకు మల్లే తయారై పోయారు. వీళ్ళల్లో ఒకరి పేరు కర్ట్, ఇంకొకరి పేరు బిల్. మా కంపెనీలో ఉన్న తమిళ గేంగ్, వీళ్ళని ముద్దుగా కర్టన్ అనీ, బిల్లన్ అనీ పిలుచుకునే వాళ్ళు. నేను కష్టపడి కర్టుడు, బిల్లుడు అని పేర్లయితే పెట్టాను గానీ, ఆ పేర్లని ఫేమస్ చెయ్యలేకపోయాను.

ఈ ఇద్దరు అమెరికన్లూ, రోజూ మంచి మంచి బట్టలు వేసుకుని టైలూ, కోట్లూ, గట్రా తొడుక్కుని మెరిసిపోతూ వచ్చేవారు. చాలా మర్యాదగా మాట్లాడే వారు. ఎంతో మర్యాదగా ఉండేవారు. అయితే మాత్రం, 'మీ ఇంట్లో ఓ రెండు రోజులుంచుకోండి నన్ను' అని, ఎలా అడిగేది? సిగ్గేసేది. సిగ్గు విడిచి అడిగినా,

వాళ్ళు, 'ఛీ, పో'మ్మంటే? అందుకని అలా అడగకుండా, వాళ్ళ కుటుంబ విషయాలు అడిగి తెలుసుకుంటూ ఉండేవాడిని. అలా తెలుసుకునే కొద్దీ, నా కోరిక పెరిగిపోయేది.

ఎలాగోలా, వీళ్ళ ఇళ్ళలోకి తొంగి చూసి, విషయాలు తెలుసుకోవాలనే కోరిక, ఇంకా పెరుగుతూనే వచ్చింది. ఉన్న స్నేహితులందరూ ఇండియన్సే. అమెరికా వాళ్ళెవరితోనన్నా స్నేహం చేసి, వాళ్ళ కొంపలోకి దూరిపోవాలని, తెగ తాపత్రయంగా ఉండేది.

ఆ రోజుల్లో, ఒక చిన్న అవకాశం వచ్చింది. మా కంపెనీలో ఉన్న ఇద్దరు అమెరికన్లలో ఒకాయన నాకు బాస్. ఆయనే కర్ట్. ఒక శనివారం సాయంకాలం, మా కంపెనీలో కొంత మందిని ఆయనింటికి డ్రింకులకి పిలిచాడు. నేనైతే డ్రింకు పార్టీలకు వెళ్ళేవాడిని కాదు గానీ, ఆయనిల్లు చూడొచ్చు కదా అనే ఆశతో వెళ్ళాను. ఆయనకీ తెలుసు, నేను కోక్ కూడా తాగనని. నా కోసం ఆరెంజ్ జ్యూస్ తప్పకుండా ఉంచుతానని చెప్పాడాయన. 'అలాగే' అని, మురుసుకుంటూ వెళ్ళాను. వీకెండ్స్‌లో బూట్లు వేసుకోవడం నాకు మహా చిరాకు. హాయిగా ఇండియాలో కొనుక్కున్న నల్లని చెప్పులేసుకుని వెళ్ళాను. కర్ట్, నన్ను గుమ్మంలో రిసీవ్ చేసుకుని నా చెప్పులు చూసి, "నీ చెప్పులు చాలా బాగున్నాయి. ఐ లైక్ దెమ్" అన్నాడు.

'చెప్పులు బాగోవడం ఏమిటో గోల' అనుకుంటూ, నవ్వుతూ లోపలకి వెళ్ళాను. అప్పుడు గ్రహించాను చెప్పులు వేసుకుని వచ్చింది, నేను మాత్రమేనని. అందరూ బూట్లు బయట విప్పినా, రంగు రంగుల సాక్స్‌లతో, చేతిలో డ్రింక్ గ్లాసు పెట్టుకుని మాట్లాడుకుంటూ, లోపలి గదుల వేపు చూడకుండా, బైట ఉన్న రెండు గదులూ తిరిగేస్తున్నారు. అయితే నా బేర్‌ఫుట్ మాత్రం ఎవరూ పట్టించుకోలేదు.

అభిమానంగా మా బాస్ ఇచ్చిన ఆరెంజ్ జ్యూస్ గ్లాసు సుతారంగా పట్టుకుని, తెలిసిన వాళ్ళతో మాట్లాడుతున్నాను. వాళ్ళలో అంకుర్ అని ఒకావిడ నాకు బాగా పరిచయం. ఆవిడ మా కంపెనీలో ఒక ఉద్యోగి భార్య. ఆవిడ దగ్గర కాస్త చనువుంది, నాకు. ఆవిడ ఇంకో కోక్ గ్లాసు పట్టుకుని నాతో మాట్లాడుతోంది. మిగిలిన మా కంపెనీ మగాళ్ళందరూ 'చక్కగా' రంగు రంగుల ద్రవాలు గ్లాసుల్లో పోసుకుని తాగుతూ, కబుర్లాడేసుకుంటున్నారు. నేను మాత్రం ఒక కన్ను లోపలి గదుల వైపు వేశాను. ఆ గదుల తలుపులు మూసి ఉన్నాయి.

మా బాస్ తన భార్యని అందరికీ పరిచయం చేశాడు. ఎవరో ఇద్దరు మెయిడ్స్‌ని హైర్ చేశారు. వాళ్ళిద్దరూ వంటింట్లో ఏవేవో తయారు చేసేస్తూ, అందరికీ సర్వ్ చేస్తున్నారు. ఏవేవో రంగు రంగుల పదార్థాలు. భోజనాలు ఏమీ లేవు. ఉత్త డ్రింకులేనట. అందరూ, ఆ రోజు చెయ్యడానికి ఇంకో పనే లేనట్టు, తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటున్నారు. వీళ్ళందరూ ఇంటికి పోయి వంటలు చేసు

కోవద్దూ? కొంపలకి పోయి తిళ్ళు తినద్దూ? ఎంత తీరిగ్గా కనిపిస్తారో! చాలా మంది తమ భార్యలతో వచ్చారు. అప్పటికి నేను ఇంకా మా కుటుంబాన్ని అమెరికా తీసుకు రాలేదు. ఎవరూ పిల్లల్ని తీసుకు రాలేదు.

కొంచెం సందు దొరగ్గానే, మా బాస్ గారి భార్యని పట్టుకున్నాను. పిల్లల గురించి అడిగాను ఆవిడని. ఆవిడ వెంటనే సంతోషంగా, 'మా పిల్లల్ని చూస్తావా?' అని అడిగింది. అంతకంటే సంతోషంగా, 'అవున'ని చెప్పాను.

అప్పుడావిడ నన్నొక్కడినీ లోపలికి తీసుకెళ్ళింది. ఆ గదిలో ఒక బేబీ సిట్టర్ ఉంది. ముగ్గురు పిల్లలున్నారు. మొదటి కొడుక్కి అంగవైకల్యం ఉంది. వీల్ చైర్‌లో కూర్చున్నాడు. వాడు ఏమీ మాట్లాడడు పాపం. అయినా తల్లిదండ్రులు వాడితో ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారట. రెండవ సంతానం ఒక మ్మాయి. ఏడేళ్ళుంటాయి. మూడవ సంతానం నాలుగేళ్ళ అబ్బాయి. వాడు మాత్రం సిసింద్రీట. వాళ్ళమ్మ చెప్పింది. వాడికి కోపం వస్తే వాళ్ళ నాన్నని 'నువ్వు నా బర్త్‌డే పార్టీకి రావడానికి వీల్లేదు' అని అంటాడట. కోపం తగ్గాక 'నువ్వు నా బర్త్‌డే పార్టీకి రావచ్చు' అంటాడట.

కాస్సేపు ఆ పిల్లలతో కబుర్లు చెప్పాను. ఆ సిసింద్రీ నన్ను, 'హగ్ మీ' (నన్ను కౌగలించుకో), 'కిస్ మీ' (నన్ను ముద్దుపెట్టుకో) అని కాస్సేపు నా ప్రాణాలు తీశాడు. ముట్టుకుంటే మాసిపోతాడేమో అన్నట్టుగా ఉన్నాడు ఆ పిల్లాడు తెల్లగా.

ఆ లోపల, ఒకావిడ ఆ గదిలోకి వచ్చి, ఒక ప్లేట్లో ఏవో పెట్టుకుని మాకు ఆఫర్ చేసింది. 'అవి ఏమిట'ని అడిగాను. 'డ్రెస్సింగ్ చేసిన బ్రెడ్ ముక్కల'ని చెప్పిందావిడ. పిల్లలు తలొకటీ తీసుకున్నారు. సిసింద్రీగాడు ఒక ముక్క తీసుకుని నా నోట్లో పెట్టాడు. సందేహిస్తూనే తిన్నాను. ఎంతో బాగుంది. 'అబ్బ' అని లొట్టలేసుకుంటూ, ఇంకో ముక్క తీసుకుని తిన్నాను. కాసేపు ఆ పిల్లలతో ఆడుకుని, మళ్ళీ ముందర గదిలో ఉన్న మా కంపెనీ వాళ్ళ దగ్గరకి వెళ్ళాను.

అంకుర్, "ఇంకో పది నిమిషాల్లో పార్టీ అయిపోతుందీ, మనం ఇంటికి పోవాలి" అని చెప్పింది. అయినా అందరూ, పార్టీ అప్పుడే మొదలైనట్టుగా, కబుర్లు చెప్పుకుంటున్నారు.

అంతలో ఇందాకటావిడ మళ్ళీ బ్రెడ్ ముక్కల పళ్ళెంతో వచ్చింది. "అంకుర్, అంకుర్, బ్రెడ్ ముక్కలు చాలా బావున్నాయి, తిన్నావా?" అని ఆమెని అడిగాను.

"అవేంటో తెలుసా?" అని అడిగిందావిడ.

"డ్రెస్సింగ్ చేసిన బ్రెడ్ ముక్కలు కదా?" అనుమానంగా చూశాను.

"అది సరే, అది రొయ్యల డ్రెస్సింగ్" అందావిడ నవ్వుతూ. అంకుర్‌కి తెలుసు నేను వెజిటేరియన్ అని.

అప్పటి వరకూ ఆ బ్రెడ్ ముక్కల రుచితో లొట్టలు వేసుకుంటున్న నాకు ప్రాణం పోయినట్లయింది. నాలిక పీకేసు

కోవాలనుకున్నాను గానీ, పీక్కోలేదు. అప్పటికే, ఆ ముక్కలు శుభ్రంగా అరిగి పోయాయి. కానీ, ఏదో ఫీలింగ్ వచ్చే సింది. అప్పటి వరకూ ముచ్చటగా కన పడ్డ ఆ రంగు రంగుల బ్రెడ్ ముక్కలు అప్పటి నుంచీ, ఘోరంగా కనపడ సాగాయి. అంకుర్ నవ్వుతూనే ఉంది, నా అవస్థ చూస్తూ. నేను కూడా బల వంతంగా నవ్వు ముఖం పెట్టాను.

అంతలో, ఎవరో బయలుదేరుతా మన్నారు. అందరూ లేవడం మొదలు పెట్టారు. ఒక్కరు కూడా పిల్లలని తీసుకు రాలేదు. 'అయినా, డ్రింకు పార్టీలకి పిల్లలనేం తీసుకు వస్తారులే' అని అనుకున్నాను. ఆ రెండు గంటల్లోనూ, వీళ్ళు ప్రపంచంలోని విషయాలన్నీ మాట్లాడేసుకుని, తమ అభిప్రాయాలన్నీ వెళ్ళబుచ్చుకున్నారు. ఆ గుంపులో ఒక ళ్ళిద్దరు నా లాంటి వాళ్ళే. కాకపోతే వాళ్ళు కోక్ తాగుతారు.

హోస్టుగారు అందరికీ వాళ్ళ కోట్లూ, జాకెట్లూ అందిస్తూ ఉంటే, అందరూ షేక్ హేండ్స్ ఇచ్చుకుంటూ, కొంపలకి బయలుదేరారు.

నేను మాత్రం కొంచెం నిరాశగానే ఇంటికి బయలుదేరాను. ఆ రెండు గంటల్లో, వాళ్ళ కుటుంబ జీవితం గురించి, నాకేమీ పెద్దగా తెలియలేదు. పిల్లలని ప్రేమగా చూసుకుంటారనీ, అంగవైకల్యం ఉన్న పిల్లాడిని చాలా బాధ్యతగా చూసుకుంటున్నారనీ మాత్రం అర్థం అయింది.

ఇండియాలో మా పెద్దమ్మకి ఒక గుడ్డి కూతురు ఉండేది. బుర్ర ఎదగ లేదు. తండ్రి మాత్రం కూతుర్ని బాగా చీదరించుకునే వాడు. తల్లీ, మిగిలిన పిల్లలూ అభిమానంగా చూసుకునే వారు. అదొక కథ.

**ఆ** అనుభవం నాకేమీ సంతృప్తి కలిగించలేదు. ఆ అమెరికన్ భార్యాభర్త లిద్దరూ నా దగ్గర ఏమీ చనువుగా మాట్లాడుకోలేదు. వాళ్ళ పిల్లలు మరీ చిన్న పిల్లలు. వాళ్ళ గురించి ఏమీ తెలుసుకోలేకపోయాను. కనీసం ఒక రోజన్నా ఉండకపోతే ఏమీ తెలియదని పించింది.

⋆ ⋆ ⋆

**ఒ**క రోజు ఇంటర్‌నెట్‌లో దేని కోసమో వెతుకుతున్నాను. అలా సెర్చ్ చేస్తూ, ఒక చాట్ హౌస్‌లోకి వెళ్ళాను. అక్కడ కొంత మంది ఇండియా సంస్కృతి గురించి తీవ్రంగా వాదించు కుంటున్నారు. రిచర్డ్ అని ఒకతను ఇండియా గురించి ఏదో ప్రశ్న వేశాడు. అక్కడ నుంచి బయటికి వద్దామను కుంటూ, అతని ప్రశ్నకి జవాబు రాశాను. అంతే, ఆ జవాబు అతనికి నచ్చేసింది. వెంటనే పట్టుకున్నాడు నన్ను. ఏవేవో ప్రశ్నలు వేయడం మొదలుపెట్టాడు. ఈ ఇంటర్‌నెట్ చాట్ హౌస్‌లలో రక రకాల పేర్లు పెట్టుకుని, రక రకాల మనుషు లుంటారు. నే నెప్పుడూ వాటి జోలికి వెళ్ళను.

నేను లాగౌట్ చేస్తున్నాననీ, అతని ఫోన్ నెంబరిస్తే మాట్లాడుతాననీ రాశాను.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=126**